


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 134 | సోమవారం 15 జూన్ 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## కృష్ణా పడవ ప్రమాదంపై
# సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం

పడవ ప్రమాదంపై సీఎం సమీక్ష..

సమగ్ర విచారణకు ఆదేశం

కోనూరు ఘటనపై ప్రభుత్వం స్పందన.. భద్రతా చర్యలు కట్టుదిట్టం

కృష్ణానది విషాదం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

పడవ ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు




అమరావతి, జూన్ 14(కెరటం): పల్నాడు జిల్లా కోనూరు సమీపంలో కృష్ణానదిలో జరిగిన పడవ ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ ఘటన వివరాలను తెలుసుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం, ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు.

## 'మళ్లీ మంచి రోజులు వస్తాయి'..
### కూటమి ప్రభుత్వంపై సజ్జల విమర్శలు




అమరావతి, జూన్ 14(కెరటం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులు శాశ్వతం కావని, భవిష్యత్తులో మళ్లీ అనుకూల పరిస్థితులు వస్తాయని ఆయన అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సజ్జల, ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను బలంగా ప్రస్తావిస్తున్న పార్టీగా వైఎస్సార్ కాంగ్రెస్ కొనసాగుతోందని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తున్నారని చెప్పారు.

## మంత్రి పదవులపై ఆశ లేదు..
## విద్యా సంస్కరణలే మా లక్ష్యం
### సోనామ్ వాంగ్‌చుక్ కీలక వ్యాఖ్యలు..




హైదరాబాద్, జూన్ 14(కెరటం): విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం, యువతలో చైతన్యం పెంపొందించడమే తమ లక్ష్యమని ప్రముఖ సామాజిక, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పేర్కొన్నారు. అధికార పదవులు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం తాము పనిచేయడం లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, యువత దేశ భవిష్యత్తును నిర్మించే శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు.

## 'అన్ని పనులు కేంద్ర మంత్రులే చేస్తే..
# సీఎం ఎందుకు?'




హైదరాబాద్, జూన్ 14 (కెరటం): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్నారని ఆయన ఆరోపించారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పాల్గొన్న రామచందర్ రావు, ధాన్యం కొనుగోలు అంశంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.

# 'రేవంత్ ప్రభుత్వానికి ఇంటర్వెల్..
## ఫస్ట్ హాఫ్ డిజాస్టర్'

కాంగ్రెస్ హామీలు అమలు కాలేదు:

'ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారు'

ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల వెల్లువ

హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని కేటీఆర్ ఆరోపణ




హైదరాబాద్, జూన్ 14(కెరటం): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటూ, "రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇంటర్వెల్ పడిపోయింది.. ఫస్ట్ హాఫ్ డిజాస్టర్" అని విమర్శించారు.

## ఇంత నీచమైన ప్రచారమా
### జగన్‌పై అచ్చెన్నాయుడు విమర్శలు




అమరావతి, జూన్ 14(కెరటం): డీఎస్సీ నియామక ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. నియామకాలపై నిరాధార ప్రచారం చేయడం ద్వారా అభ్యర్థులను, ఉపాధ్యాయ వ్యవస్థను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు.

డీఎస్సీ వ్యవహారంపై మాట్లాడుతూ, నియామక ప్రక్రియకు సంబంధించి గతంలో దాఖలైన పలు వ్యాజ్యాలను న్యాయస్థానాలు కొట్టివేశాయని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యార్థులకు
# కార్పొరేట్ తరహా స్కూల్ కిట్లు

27 లక్షల మంది విద్యార్థులకు కొత్త స్కూల్ కిట్లు

ప్రభుత్వ విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు..పూర్తి కిట్లు

రూ.687.78 కోట్లతో విద్యార్థులకు సమగ్ర స్కూల్ కిట్

ప్రభుత్వ స్కూళ్లలో కొత్త రూపు.. నాణ్యతకు పెద్దపీట

ఒకే విధానంలో స్కూల్ కిట్లు.. రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ

విద్యార్థులకు కార్పొరేట్ తరహా సదుపాయాలు..

ప్రభుత్వ ప్రత్యేక ప్రణాళిక




హైదరాబాద్, జూన్ 14(కెరటం): ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి నాణ్యమైన యూనిఫాంలు, స్కూల్ కిట్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టింది. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సుమారు రూ.687.78 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాదరక్షలు, సాక్సులు, బ్యాగులు తదితర అవసరమైన సామగ్రిని అందించనున్నారు. గురుకులాలు, ప్రత్యేక నివాస పాఠశాలల విద్యార్థులకు అదనంగా బెడ్డింగ్ సామగ్రి, ట్రంక్ బాక్స్, ప్లేటు, గ్లాస్, కటోరా, పీటీ డ్రెస్, ట్రాక్‌సూట్, నైట్ డ్రెస్ వంటి పూర్తి కిట్‌ను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

ఈసారి యూనిఫాంల తయారీలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వస్త్రాల కొనుగోలు నుంచి కుట్టు పనుల వరకు ప్రతి దశలో ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థుల కోసం అవసరమైన కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రముఖ సంస్థలతో పాటు తెలంగాణ చేనేత సంస్థల ద్వారా సమకూరుస్తున్నారు.

విద్యార్థులకు అందించే యూనిఫాంల రంగుల్లో కూడా మార్పులు చేశారు. డే స్కాలర్లకు లైట్ బ్లూ--డార్క్ బ్లూ కలయికలో యూనిఫాంలు ఉండగా, గురుకుల విద్యార్థులకు ప్రత్యేక రంగుల నమూనాలు సిద్ధం చేశారు. విద్యార్థినుల కోసం ప్రత్యేక డిజైన్లతో దుస్తులు అందించనున్నారు.

యూనిఫాంల కుట్టు బాధ్యతను రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఈ నిర్ణయంతో వేలాది మహిళలకు ఉపాధి లభించడంతో పాటు సంఘాలకు గణనీయమైన ఆదాయం సమకూరనుంది.

అన్ని విద్యా శాఖలు, గురుకుల సంస్థలకు అవసరమైన సామగ్రిని ఈసారి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా ఒకే విధంగా కొనుగోలు చేసి పంపిణీ చేయనున్నారు. దీనివల్ల నాణ్యతలో ఏకరీతి, పారదర్శకత, సమయానికి సరఫరా వంటి అంశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకులాల్లోని విద్యార్థులకు బూట్లు, సాక్సులు, బెల్టులు, టైలు, బ్యాగులు అందించనుండగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కూడా తొలిసారిగా బ్యాగులు, బూట్లు, బెల్టులు, టైలు, సాక్సులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## ప్రభుత్వ వైద్య రంగంలోకి
# ఏఐ సేవలు




హైదరాబాద్, జూన్ 14(కెరటం): ప్రభుత్వ వైద్య సేవలను మరింత ఆధునికీకరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. త్వరలోనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి, కృత్రిమ మేధస్సు వైద్యులకు ప్రత్యామ్నాయం కాదని, వారి నిర్ణయ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే సాధనమని అన్నారు.

## చరిత్ర--భవిష్యత్తుకు
# వారధిగా హైదరాబాద్

సలార్ జంగ్ మ్యూజియం చుట్టూ హెరిటేజ్ సర్క్యూట్

చరిత్రను కాపాడుతూ.. భవిష్యత్తును నిర్మిస్తున్న హైదరాబాద్

వారసత్వానికి కొత్త ఊపు.. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక




హైదరాబాద్, జూన్ 14(కెరటం): చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి వైపు దూసుకెళు_న్న నగరంగా హైదరాబాద్ నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నగరాన్ని కేవలం భవనాలు, రహదారులు మాత్రమే కాకుండా, చరిత్రను నిలబెట్టే సాంస్కృతిక సంస్థలు కూడా నిర్మిస్తాయని ఆయన అన్నారు.

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్
సోమవారం 15 జూన్ 2026

# ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ తరహా స్కూల్ కిట్లు

మొదటి పేజీ తరువాయి

యూనిఫాంలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు వంటి ఆర్డర్లలో గణనీయమైన భాగాన్ని తెలంగాణ చేనేత సహకార సంస్థలకు కేటాయించడం ద్వారా చేనేత రంగానికి ప్రోత్సాహం లభించనుంది. టైలు, బెల్టులు, ఐడీ కార్డుల తయారీ బాధ్యతలను ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించడం ద్వారా స్థానిక పరిశ్రమలకు కూడా ఊతం లభించనుంది.

ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టుబడిగా భావిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని అర్హులైన విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కిట్లు అందేలా చర్యలు చేపడుతోంది.

# “మంత్రి పదవులపై ఆశ లేదు.. విద్యా సంస్కరణలే మా లక్ష్యం”

మొదటి పేజీ తరువాయి

ప్రజల్లో అవగాహన పెంచడం, విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను వెలుగులోకి తేవడం కోసం చేపడుతున్న కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

దేశవ్యాప్తంగా తరచూ వెలుగుచూస్తున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దు వంటి సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసిన వాంగ్‌చుక్, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవస్థలో లోపాలు చోటుచేసుకున్నప్పుడు బాధ్యులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని అభిప్రాయపడ్డారు.

విద్యను కేవలం పరీక్షలు, మార్కులకే పరిమితం చేయకుండా, విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించే దిశగా సంస్కరణలు అవసరమని ఆయన సూచించారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు సమగ్ర మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణపై కూడా మాట్లాడిన ఆయన, రాబోయే తరాలకు నాణ్యమైన విద్య ఎంత ముఖ్యమో, స్వచ్ఛమైన గాలి, నీరు కూడా అంతే అవసరమని అన్నారు. సహజ వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం పౌర సమాజం చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించిన వాంగ్‌చుక్, అభివృద్ధి పేరుతో ప్రకృతి సంపదను నష్టపరచకుండా సమతుల్య విధానాలు అవలంబించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు విద్య, పర్యావరణ రంగాల్లో దీర్ఘకాలిక దృష్టితో నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ వైద్య రంగంలోకి ఏఐ సేవలు




హైదరాబాద్, జూన్ 14(కెరటం): ప్రభుత్వ వైద్య సేవలను మరింత ఆధునికీకరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. త్వరలోనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి, కృత్రిమ మేధస్సు వైద్యులకు ప్రత్యామ్నాయం కాదని, వారి నిర్ణయ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే సాధనమని అన్నారు.

ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించడం, చికిత్సను వేగవంతం చేయడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో ఇప్పటికే ఎక్స్‌రే చిత్రాల విశ్లేషణతో పాటు సెప్సిస్, ఫ్యాటీ లివర్ వంటి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే సాంకేతికతలను వినియోగిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సేవలను క్రమంగా మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు విస్తరించనున్నట్లు చెప్పారు.

భవిష్యత్ వైద్యులను సాంకేతిక మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సిమ్యులేషన్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక వైద్య విద్యతో పాటు డిజిటల్ నైపుణ్యాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

ఫార్మా, బయోటెక్నాలజీ, వ్యాక్సీన్ తయారీ, వైద్య పరిశోధన రంగాల్లో ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్, రాబోయే రోజుల్లో ఏఐ ఆధారిత ఆరోగ్య పరిష్కారాల కేంద్రంగా కూడా ఎదిగే అవకాశాలు ఉన్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు.

సదస్సులో దేశ, విదేశాల వైద్య నిపుణులు, పరిశోధకులు, సాంకేతిక రంగ ప్రతినిధులు, వైద్య విద్యార్థులు, ఆరోగ్య రంగ నిపుణులు పాల్గొని ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై అభిప్రాయాలు పంచుకున్నారు.

# ఇంత నీచమైన ప్రచారమా

మొదటి పేజీ తరువాయి

ప్రశ్నాపత్రాల లీకేజీ, మెరిట్ జాబితా, స్పోర్ట్స్ కోటా, రిజర్వేషన్లపై వచ్చిన ఆరోపణలకు అధికారులు ఇప్పటికే వివరణ ఇచ్చారని అన్నారు.డీఎస్సీ నియామకాల్లో కుల ప్రాతిపదికన అన్యాయం జరిగిందన్న ఆరోపణలను కూడా మంత్రి తిరస్కరించారు. గణాంకాలు పరిశీలిస్తే ప్రచారంలో ఉన్న ఆరోపణలకు వాస్తవ ఆధారాలు లేవని ఆయన పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాల కంటే వాస్తవాల ఆధారంగా రాజకీయాలు చేయాలని సూచించారు. తప్పుడు ప్రచారంతో యువతను, ఉద్యోగార్థులను గందరగోళానికి గురిచేయడం సరికాదని అన్నారు.

డీఎస్సీ నియామక ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని ప్రభుత్వం స్పష్టం చేస్తోందని, అర్హత ఆధారంగానే నియామకాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

# కృష్ణా పడవ ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

మొదటి పేజీ తరువాయి

అధికారుల సమాచారం ప్రకారం, నదిలో ప్రయాణిస్తున్న పడవ ఇసుక దిబ్బను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ఈ సాయాన్ని తక్షణమే అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలను ఆసుపత్రికి తరలించి, అవసరమైన ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఘటనకు దారితీసిన కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, సాగునీటి శాఖల అధికారులతో కూడిన బృందం ద్వారా సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని సూచించారు.

భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నదీ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని, పడవల నిర్వహణ, ప్రయాణికుల రక్షణకు అవసరమైన చర్యలను అమలు చేయాలని అధికారులకు సీఎం సూచించారు.

సహాయక చర్యలు, బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# ‘అన్ని పనులు కేంద్ర మంత్రులే చేస్తే.. సీఎం ఎందుకు?’

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్నారని ఆయన ఆరోపించారు.

అంబర్‌పేట్ నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పాల్గొన్న రామచందర్ రావు, ధాన్యం కొనుగోలు అంశంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. అయితే ఆ కార్యక్రమాలకు సంబంధించిన గుర్తింపును రాష్ట్ర ప్రభుత్వం తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు.

కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల సహకారంపై ఆధారపడుతున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. “అన్ని పనులు కేంద్ర మంత్రులు, ఎంపీలే చేస్తే.. ముఖ్యమంత్రి పాత్ర ఏమిటి?” అని ప్రశ్నించారు.

హైదరాబాద్‌లో ఇటీవల కురిసిన వర్షాల అనంతరం ఏర్పడిన పరిస్థితులను ప్రస్తావిస్తూ, నగర మౌలిక సదుపాయాల నిర్వహణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. నగర అభివృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కూడా స్పందించిన ఆయన, ముందుగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల ప్రస్తుత సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు.

రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుతూ, బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలపై విమర్శలు గుప్పించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అలాగే కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అందించిన నిధులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని రామచందర్ రావు సవాల్ విసిరారు.

# చరిత్ర--భవిష్యత్తుకు వారధిగా హైదరాబాద్




హైదరాబాద్, జూన్ 14(కెరటం):: చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి వైపు దూసుకెళ్తున్న నగరంగా హైదరాబాద్ నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నగరాన్ని కేవలం భవనాలు, రహదారులు మాత్రమే కాకుండా, చరిత్రను నిలబెట్టే సాంస్కృతిక సంస్థలు కూడా నిర్మిస్తాయని ఆయన అన్నారు. సలార్ జంగ్ మ్యూజియం నగర వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు.

సలార్ జంగ్ మ్యూజియం 75వ వార్షికోత్సవం, సలార్ జంగ్--3 జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క, ప్రపంచ నలుమూలల నుంచి వేలాది కళాఖండాలను సేకరించి ప్రజలకు అందుబాటులో ఉంచడం సలార్ జంగ్--3 దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. వివిధ మతాలు, సంస్కృతులు, నాగరికతలకు చెందిన అరుదైన కళాఖండాలు ఒకే చోట ఉండటం ఈ మ్యూజియం ప్రత్యేకత అని వివరించారు.

ముసి నదిని ఆధునిక రివర్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేసి, దానిని సలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్‌షాహీ సమాధులు, చౌమహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్ వంటి వారసత్వ ప్రదేశాలతో అనుసంధానించే సమగ్ర ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి ద్వారా దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు స్థానిక ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన చెప్పారు.

హైదరాబాద్ చరిత్రకే పరిమితమైన నగరం కాదని, ఐటీ, బయోటెక్నాలజీ, ఫార్మా వంటి ఆధునిక రంగాల్లో కూడా అంతర్జాతీయ గుర్తింపు పొందిందని భట్టి అన్నారు. వారసత్వాన్ని పరిరక్షిస్తూ సాంకేతిక అభివృద్ధిని సమన్వయం చేయడం నగర ప్రత్యేకతగా అభివర్ణించారు.

రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి కనీసం ఒక్కసారైనా సలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసి మ్యూజియంలను విద్యా, పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అలాగే వ్యాపార, పెట్టుబడి అవసరాల కోసం హైదరాబాద్‌కు వచ్చే విదేశీ ప్రతినిధులు నగర చారిత్రక వారసత్వాన్ని కూడా అనుభవించేలా ప్రత్యేక పర్యాటక కార్యక్రమాలను రూపొందిస్తామని తెలిపారు. నైట్ టూరిజం, బహుభాషా గైడెడ్ వాక్స్, మెరుగైన రవాణా సౌకర్యాలతో ఓల్డ్ సిటీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

మ్యూజియాన్ని దశాబ్దాలుగా సంరక్షిస్తున్న క్యూరేటర్లు, సిబ్బంది, భద్రతా సిబ్బంది సేవలను ఈ సందర్భంగా భట్టి ప్రశంసించారు. సలార్ జంగ్--3 సేకరించిన వారసత్వ సంపదను మరింత ఆధునికంగా సంరక్షించి భావితరాలకు అందించడం అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# ‘మళ్లీ మంచి రోజులు వస్తాయి’..

మొదటి పేజీ తరువాయి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అన్ని వర్గాల అర్హులైన లబ్ధిదారులకు అందించామని సజ్జల పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలతో పాటు ఇతర అర్హులకూ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో శాంతి భద్రతలు, వ్యాపార అనుకూల వాతావరణం మెరుగ్గా ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు.

విద్య, వైద్య రంగాల్లో గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించిన సజ్జల, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని అన్నారు. ఆ కార్యక్రమాల గురించి ప్రజలకు మరింత విస్తృతంగా వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా స్పందించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అమరావతి అభివృద్ధి పేరుతో భారీ ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆరోపించారు.

పార్టీ కార్యకర్తలు ప్రజలతో మరింత మమేకమై పార్టీ విధానాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సజ్జల పిలుపునిచ్చారు. సమన్వయంతో పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# నిరుద్యోగ యువత ఆశలు నిజం చేస్తాం.. ‘వార్షిక-2025’ పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం



న్యూస్ డెస్క్ ,జూన్ 14(కెరటం): నిరుద్యోగ యువత ఆశలకు అనుగుణంగానే ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం వరుస నోటిఫికేషన్లు జారీ చేయబోతోందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ప్రచురించిన పోటీ పరీక్షల ప్రత్యేక పుస్తకం ‘వార్షిక 2025’ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించిన బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ యువతను విజేతలుగా నిలిపేందుకు, ‘మేధో తెలంగాణ’ సాధన దిశగా ప్రభుత్వం ఉచిత శిక్షణతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తెస్తోందన్నారు. పోటీ పరీక్షల్లో 20 నుంచి 25 శాతం ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ నుంచే వస్తున్నందున, అభ్యర్థుల సౌకర్యార్థం జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలతో కూడిన ‘వార్షిక 2025’ పుస్తకాన్ని బీసీ స్టడీ సర్కిల్ రూపొందించిందని చెప్పారు.

ఈ పుస్తకంలో కరెంట్ అఫైర్స్‌తో పాటు ఎండోమెంట్స్ ఉద్యోగాల కోసం ప్రత్యేకంగా ‘భారతీయ వైదిక హైందవ విజ్ఞానం’ అంశాన్ని, అలాగే జనరల్ నాలెడ్జ్, రాజ్యాంగం, చరిత్ర, భౌగోళిక శాస్త్రం, తెలంగాణ ఉద్యమం వంటి ముఖ్యమైన సమాచారాన్ని పొందుపరిచినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్, పోలీస్, రైల్వే, ఉపాధ్యాయ ఉద్యోగాలకు ప్రభుత్వం ఉచితంగా అన్ని సౌకర్యాలతో శిక్షణ ఇస్తోందని, యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ‘రేవంత్ ప్రభుత్వానికి ఇంటర్వెల్.. ఫస్ట్ హాఫ్ డిజాస్టర్’

మొదటి పేజీ తరువాయి

ఖైరతాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పనితీరును ప్రజలు ఇప్పటికే అంచనా వేసేశారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఉద్యోగాల కల్పన, సంక్షేమ హామీలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని ఆరోపించారు.

హైదరాబాద్ అభివృద్ధిపై స్పందించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త గృహ నిర్మాణాల విషయంలో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కొన్ని కార్యక్రమాల కొనసాగింపులో కూడా స్పష్టత లేదని అన్నారు. ప్రజలకు అందాల్సిన పలు ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపించారు.



యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల అంచనాలకు అనుగుణంగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అలాగే రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపైనా వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాల పేర్ల మార్పుపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాలకు కొత్త పేర్లు పెట్టడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు.

ఖైరతాబాద్‌లో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని కార్యకర్తలకు సూచించిన కేటీఆర్, ప్రతి నాయకుడు తన పరిధిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని కోరారు. సమన్వయంతో పనిచేస్తే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు విజయావకాశాలు మెరుగవుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

కెరటం న్యూస్

సోమవారం 15 జూన్ 2026

# జనగాంలో అడ్వాంటేజ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి అడుగులు



**కెరటం న్యూస్ జనగాం, జూన్ 14**

జనగాం, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాలకు మంజూరైన రెండు అడ్వాంటేజ్ టెక్నాలజీ సెంటర్‌లు (ఎటిసిలు) యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో కీలకంగా మారనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందిన యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు, స్వయం ఉపాధి దిశగా సొంత సంస్థలను స్థాపించుకునే అవకాశాలు కూడా ఏర్పడనున్నాయి. ఈ నేపథ్యంలో జనగాం మండలం పసలమట్ల గ్రామంలో ఎటిసి నిర్మాణం కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. స్థల సరిహద్దులపై చర్చించిన అనంతరం అధికారులు సర్వే నిర్వహించి హద్దులను ఖరారు చేశారు. తదుపరి ఆ స్థలాన్ని తెలంగాణ గ్లోబల్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిజిఐఐసి)కు అధికారికంగా అప్పగించారు. కేంద్ర నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు ప్రభుత్వం వెంటనే శంకుస్థాపన చేసి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో నాగరత్న సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బిర్రు ఇస్తారి, ఎటిసి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామానందం, రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యల పరిష్కారానికి జూన్ 19,20న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు



**కెరటం న్యూస్ బచ్చన్నపేట, జూన్ 14**

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూన్ 19,20 తేదీలలో జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న రైతాంగ ధర్నాలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బచ్చన్నపేట మండల కేంద్రంలో రైతాంగ ధర్నాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రెండు ఎకరాల వరకు మాత్రమే రైతు భరోసా నిధులు జమ చేశారని, పెండింగ్‌లో ఉన్న గత వానకాలం, ప్రస్తుత యాసంగి రైతు భరోసా నిధులు, సన్నధాన్యం బోనస్ బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ రంగంలో విద్యుత్ ప్రైవేటీకరణకు దారితీసే రైతు డిస్కంను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, రైతులపై అదనపు భారం మోపే నిర్ణయాలను నిలిపివేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పొటాష్, భాస్వరం, కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించి రైతులకు తగినంత ఎరువులు అందుబాటులో ఉంచాలని అన్నారు.

యూరియా బుకింగ్ యాప్ కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం వ్యవసాయ రంగానికి 18 శాతం పంట రుణాలు అందించి, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.

అదేవిధంగా కిసాన్ సమ్మాన్ పథకాన్ని జిల్లాలోని అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని, ఏఈవోలు క్లస్టర్ స్థాయిలో క్షేత్ర సందర్శనలు చేసి క్రాప్ బుకింగ్ నిర్వహించాలని సూచించారు. నకిలీ, కల్తీ విత్తనాల నివారణకు సమగ్ర చట్టం తీసుకురావాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న జూన్ 19,20 తేదీల రైతాంగ ధర్నాలలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామావత్ మీట్యా నాయక్, జిల్లా కమిటీ సభ్యురాలు మోకు భవాని, సీనియర్ నాయకులు గురజాల లక్ష్మీనర్సింహారెడ్డి, మద్దోజు రామచొక్కం, బండకింది బాల్ నారాయణ, సాంబరాజు దుర్గాప్రసాద్, తాండ్ర ఆనందం, వెంకటమ్మ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరి మండలంలో ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చివరి తేదీ: జూన్19,సాయంత్రం 4 గంటల వరకు

**కెరటం న్యూస్ పర్వతగిరి/జూన్ 14**



వరంగల్ జిల్లా:పర్వతగిరి, మండలంలోని అన్నారం, కొంకపాక, ఏనుగల్ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హతలు: ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి:జనరల్ అభ్యర్థులకు 18 నుంచి 44 సంవత్సరాలు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుంది. ఎంపిక విధానం: స్థానికత, విద్యార్హత మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 19వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఎంఈఓ బిక్షపతి సూచించారు.

# తొలకరికే సాగు వద్దు - ఉద్యాన శాఖ ముఖ్య సూచనలు

**కెరటం న్యూస్, పర్వతగిరి / జూన్ 14 :**

ముఖ్య అంశాలు వాతావరణ అంచనాలు: ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ వానాకాలంలో రాష్ట్రంలో వర్షపాతంలో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉంది. దీర్ఘకాల సగటులో 90 శాతం మాత్రమే వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. విత్తనాలు నాటే సరైన సమయం కేవలం తొలకరి జల్లులకే పంటలు వేయవద్దు. రెండు, మూడు మంచి వర్షాలు (సుమారు 60 నుంచి 75 మిల్లీమీటర్ల వర్షం) పడిన తర్వాత, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు నాటాలి.

ప్రత్యామ్నాయ పంటలు: వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను తగ్గించి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలి.

నీటి యాజమాన్యం మరియు తేమ సంరక్షణ:నేలలో తేమను నిలుపుకోవడానికి పశువుల ఎరువు, వర్మికంపోస్ట్, వేప చెక్క వంటి సేంద్రియ ఎరువులను వాడాలి.

నీటి సంరక్షణ కోసం ఎత్తైన బెడ్లు, మల్చింగ్ పద్ధతిని పాటించాలి మరియు పొలంలో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి.



డ్రిప్ ఇరిగేషన్,ఫర్టిగేషన్ పద్ధతులను ఉపయోగించి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

మసాలా పంటలు (మిర్చి, పసుపు, ధనియాలు):నీటి ఎద్దడిని తట్టుకునే స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలి. మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్ తో పాటు వేడిని తట్టుకునేందుకు సల్ఫేట్ ఆఫ్ పొటాష్ లేదా పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలి. పండ్ల తోటలు: మామిడి, జామ, సీతాఫలం, బత్తాయి, నిమ్మ తదితర తోటల్లో ఎండు కొమ్మల కత్తిరింపు, మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్ పాటించాలి. పండ్ల నాణ్యత కోసం పొటాషియం నైట్రేట్, నత్రజని, భాస్వరం వంటివి పిచికారీ చేయాలి. వాణిజ్య ఉ తోట పంటలు: ఆయిల్ పామ్,అరటి, కొబ్బరి, కోకో వంటి పంటల్లో తప్పనిసరిగా మల్చింగ్ మరియు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులు అనుసరించాలి. వ్యాధిగ్రస్తులైన పిలకలను, కొమ్మలను తొలగించి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

కూరగాయలు ఉ సుగంధ ద్రవ్యాలు: వర్షాభావ పరిస్థితులను, స్వల్పకాలిక నీటి ఎద్దడిని తట్టుకునే కూరగాయల రకాలను సాగు చేయాలి. పుదీనా, లెమన్ గ్రాస్, అలోవెరా వంటి పంటలకు కూడా మల్చింగ్,డ్రిప్ విధానాలు మేలు చేస్తాయి.

# అత్యంత వైభవంగా గోదావరి నదీహారతి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కెరటం న్యూస్ :**



భద్రాచలంలో పవిత్ర గోదావరి నదికి ఆదివారం అధిక జ్యేష్ఠ మాస తత్కాల అమావాస్య సందర్భంగా నదీహారతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గోదావరి స్నాన ఘట్టాల వద్ద జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై హారతిని కనులారా వీక్షించారు.

ఈ సందర్భంగా రామ వజ్జల రవికుమార్ మాట్లాడుతూ, గౌతమి గోదావరి నదికి సమర్పించే నదీహారతి అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని, దీనిని దర్శించిన భక్తులకు విశేష పుణ్యఫలాలు లభిస్తాయని అన్నారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ, దేవాదాయ శాఖల సిబ్బంది, స్థానిక పురోహిత సంఘం సహకారంతో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తుల ఆదరణ రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు.

పురోహితులు గోదావరి హారతి విశిష్టతను భక్తులకు వివరిస్తూ గణపతి పూజ, దీపోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు సమర్పించిన పూజా ద్రవ్యాలతో శ్రీ సీతారామచంద్రస్వామివారికి, గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన నిర్వహించి లోకకళ్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కార్యక్రమం ముగింపులో శాంతి మంత్ర పఠనం నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. రవికుమార్--లక్ష్మీ దంపతులు, రామకృష్ణ, పీవీఎస్ఎన్ రెడ్డి, రామాచారి అండ్ సన్స్ ఆధ్వర్యంలో ప్రసాద పంపిణీ జరగగా, పూజా సామాగ్రిని భద్రాచలం రెడీమేడ్ బట్టల షాప్ అసోసియేషన్ అందించింది.



ఈ కార్యక్రమంలో పురోహితులు సత్యప్రసాద్ శర్మ, అశోక్ కుమార్ శర్మ, సుబ్రహ్మణ్య ఆచార్యులు, రామాచార్యులు, తేజ శర్మ, శివ, పీవీఎస్ఎన్ రెడ్డి హారతులు సమర్పించగా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గోళీల ఆటలో సందడి చేసిన యువత

**శతాబ్దాల నాటి మన పురాతన గ్రామీణ క్రీడ 'గోళీల ఆట' మళ్లీ ప్రాణం**

**నేటి తరం పిల్లలతో ' ' 'గోళీల ఆట'ఆడిన మాజీ వైస్ ఎంపిపి ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు**

**కెరటం న్యూస్, పర్వతగిరి (కల్లెడ) / జూన్ 14 :**

ఆధునిక కాలంలో స్మార్ట్‌ఫోన్ గేమ్‌లు, ఆన్‌లైన్ ఆటల జోరు పెరిగిపోయిన ఈ రోజుల్లో, వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో శతాబ్దాల నాటి మన పురాతన గ్రామీణ క్రీడ 'గోళీల ఆట' మళ్లీ ప్రాణం పోసుకుంది. ఆదివారం నాడు గ్రామ పరిసరాల్లోని యువ నాయకులు మాజీ వైస్ ఎంపిపి ఎర్రబెల్లి రాజేశ్వరరావు స్వస్థలంలో స్థానిక యువకులు, బాలురు కలిసి ఎంతో ఉత్సాహంగా గోళీల ఆట ఆడుతూ కనిపించారు.

మాయమవుతున్న పాత జ్ఞాపకాలు ఒకప్పుడు పల్లెల్లో ప్రతి వీధిలోనూ పిల్లలు ఎంతో ఇష్టంగా ఆడే ఈ ఆటలు నేటి డిజిటల్ యుగంలో పూర్తిగా కనుమరుగవుతున్నాయి. నేటి తరం పిల్లలకు ఈ ఆటల గురించి కనీస అవగాహన కూడా లేకుండా పోతోంది. ఇలాంటి తరుణంలో కల్లెడ గ్రామ యువకులు నేలపైన గుంతలు తీసి, సాంప్రదాయ పద్ధతిలో గోళీలను గురిచూసి కొడుతూ పాత రోజులను గుర్తుచేసుకున్నారు.

శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే ఆటలు

ఈ సందర్భంగా ఆటలో పాల్గొన్న యువకులు మాట్లాడుతూ.. "స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలై సమయాన్ని వృథా చేసుకునే కంటే,ఇలాంటి సాంప్రదాయ ఆటలు ఆడటం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. స్నేహితుల మధ్య ఆత్మీయత పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది" అని తెలిపారు.



గ్రామంలో యువకులు ఇలా ఉత్సాహంగా పురాతన ఆటలు ఆడటం చూసి పెద్దలు సైతం తమ చిన్ననాటి రోజులను గుర్తుచేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. మన సంస్కృతిని,గ్రామీణ క్రీడలను కాపాడుకోవడానికి ఇలాంటి ప్రయత్నాలు ఎంతో అవసరమని గ్రామస్థులు కొనియాడారు. ఈ ఆటలో ముంజ శ్రావణ్ గౌడ్, ఎర్రబెల్లి శ్రేయాన్ రాజేశ్వరరావు రావు, హాంజద్ పాష,ముదురకోల రాజు,వడ్లకోండ రంజీత్,దోమ్మటి భరత్,ముంజాల అరవింద్,ముదురకోల శ్రీకాంత్, మధు, మల్లేష్ లతో పాటు తదితరులు ఉన్నారు.

# ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మెగా వైద్య, రక్తదాన శిబిరం

**కెరటం న్యూస్ ధర్మసాగర్, జూన్ 14**

ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మసాగర్ మండల కేంద్రంలోని పునీత అంతోని దేవాలయ ప్రాంగణంలో గంగారపు ఆదాము శాంతమ్మ ఫౌండేషన్ (జి.ఏ.ఎస్.ఎఫ్) ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఫాదర్ కొలంబో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మెడికేర్ జనరల్ హాస్పిటల్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

శిబిరంలో 300 మందికి పైగా ప్రజలకు వైద్యులు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ విలువైన వైద్య సలహాలు అందించారు.



అదేవిధంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మందికి పైగా యువతీ యువకులు, గ్రామస్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రక్తదానం ద్వారా ప్రమాదాలు, అత్యవసర చికిత్సలు, శస్త్రచికిత్సలు మరియు ఇతర వైద్య అవసరాల సమయంలో అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని వైద్యులు తెలిపారు.

ఈ సందర్భంగా మెడికేర్ జనరల్ హాస్పిటల్ డైరెక్టర్ ఫాదర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ, "రక్తదానం అనేది ప్రాణదానంతో సమానం. మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం అనేక మంది ప్రాణాలను కాపాడగలదు. యువత రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమైన విషయం" అని అన్నారు.



జి.ఏ.ఎస్.ఎఫ్ వ్యవస్థాపక చైర్మన్ గంగారపు అజయ్ ఆదాము మాట్లాడుతూ, తమ తండ్రి గంగారపు ఆదాము జ్ఞాపకార్థం ఫౌండేషన్‌ను స్థాపించి విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన దాతలకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. రక్తదాతల సేవా భావాన్ని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, విచారణ గురువులు ఫాదర్ జోజి బాబు, ఫాదర్ సంజయ్, మెడికేర్ జనరల్ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, జి.ఏ.ఎస్.ఎఫ్ కుటుంబ సభ్యులు బూడిద విజయ, జన్ను అనురాగ్, గంగారపు సునీత, జ్యోతి, యాకోబు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్



## పెంచలకోనలో ఘనంగా యోగాసనాల ప్రదర్శన




నెల్లూరు జిల్లా రాపూరు(కెరటం):– ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం (పెంచలకోన) నందు 'యోగాంధ్ర' ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 7వ తేదీ నుండి 21వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక యోగాసన ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.నెల్లూరు జిల్లా పతంజలి యోగ సమితి అధ్యక్షులు సిహెచ్. పెంచలయ్య, యోగ గురువులు రవీంద్ర, రేవతి మరియు వారి బృందం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన సాగింది. వారు పలు క్లిష్టమైన యోగాసనాలను వేసి చూపిస్తూ, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వయంగా యోగాసనాలు వేశారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో, శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఎలా పెంపొందించుకోవచ్చో ఈ సందర్భంగా యోగ గురువులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.

## వైభవంగా బుగ్గేశ్వరస్వామి మాసశివరాత్రి వేడుకలు



- కనులపండువగా శ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవం
- అభయారణ్యంలో శివనామస్మరణ.. వైభవంగా పల్లకి సేవ!

నెల్లూరు జిల్లా రాపూరు(కెరటం):– నెల్లూరు జిల్లా రాపూరు మండల పరిధిలోని ఆకలివలస శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి అభయారణ్యం లో వెలసిన శ్రీ బుగ్గేశ్వరస్వామి దేవస్థానంలో నాల్గవ మాసశివరాత్రి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం లోకకల్యాణార్థం మండల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మాదాటి చంద్రమోహన్ యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారికి అన్నప్రసాద వితరణ చేశారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**• మానవత్వం చాటుకున్న టిడిపి నాయకుడు ఈగ రాజారెడ్డి**



నెల్లూరు జిల్లా రాపూరు(కెరటం):– నెల్లూరు జిల్లా, రాపూరు మండలం గోనుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రామకూరు గ్రామానికి చెందిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన చలమల రమణమ్మ (83) అనే వృద్ధురాలు ఆదివారం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు.ఈ విషయం తెలిసిన వెంటనే గోనుపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ (టిడిపి) నాయకుడు ఈగ రాజారెడ్డి హుటాహుటిన రామకూరు గ్రామానికి చేరుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. అనంతరం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగా రూ. 5,000 రూపాయలు నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.పేద కుటుంబాలకు అండగా నిలవడమే తెలుగుదేశం పార్టీ ఆశయమని, రమణమ్మ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా రాజారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. చనిపోయిన వృద్ధురాలి అంత్యక్రియల కోసం తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించిన ఈగ రాజారెడ్డిని గ్రామస్థులు అభినందించారు.

## 108 రౌండ్ల సామూహిక సూర్య నమస్కారాలు



యోగాతోనే ఆరోగ్య భాగ్యమన్న ప్రచారంతో ఉచితంగా యోగ సేవలు అందిస్తున్న విశాఖపట్నంకు చెందిన ఓం శ్రీ యోగ సంస్థ ఒడిశాలోని కోణార్క్ సూర్యదేవాలయంలో నిర్వహించిన 108 రౌండ్ల సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం విజయవంతమైంది. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగ సాధకులు 108 రౌండ్లలో సూర్య నమస్కారాలను చేశారు. కోణార్క్ సూర్యదేవాలయ ప్రాంగణంలో సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహణ తమ పూర్వజన్మ సుకృతమని యోగ గురువు డాక్టర్ చిలుక వెంకట రమేష్ అన్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమానికి అవకాశం కల్పించిన గవర్నర్ హరిబాబుకు యోగా బృందం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాము ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో సామూహిక సూర్య నమస్కారాలు కార్యక్రమం నిర్వహించామన్నారు. త్వరలో విశాఖపట్నం సింహాచలం తో పాటు అన్నవరంలో కూడా తమ సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

**సూర్య ప్రణామ్ అద్భుత కార్యక్రమం: గవర్నర్ కంభంపాటి హరిబాబు**

దివ్య తేజోమయుడైన ప్రభాకరుడి క్షేత్రంలో ప్రభాత వేళ యోగసాధకుల సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం సరికొత్త శక్తిని ప్రతి ఒక్కరికి అందజేసిందని ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ కంభంపాటి హరిబాబు తెలిపారు. సూర్య నమస్కారాలతో పాటు సౌర శక్తిని కూడా వాడుకోవడం పౌరులుగా తమ ముందున్న ప్రథమ కర్తవ్యం అని ప్రతి ఒక్కరూ గుర్తుఎరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంధన వినియోగం తగ్గించేందుకు విభిన్న మార్గాలను సూచించారు. సౌర శక్తి వినియోగానికి ప్రతి ఒక్కరూ ముగ్గు చూపాలని కోరారు. విశాఖకు చెందిన ఓం శ్రీ యోగ సంస్థలో తానూ సభ్యుడినేనని ఆరోగ్య సమస్యలకు యోగానే పరిష్కారమని ఆయన సూచించారు. ఆరోగ్య భాగ్యం కోసం వివిధ పుణ్యక్షేత్రాల్లో ఓం శ్రీ యోగ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఓం శ్రీ యోగ సంస్థ ఫౌండర్ యోగ మాస్టర్ డాక్టర్ చిలుక వెంకట రమేష్, సంస్థ ప్రతినిధులు శాంతారామ్, మధుసూదన్ రావు, ధర్మరాజు, జిల్లా యోగా సంస్థల ప్రతినిధి యోగ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్న నేదురుమల్లి



ఉమ్మడి నెల్లూరుజిల్లా వెంకటగిరి(కెరటం): –నేడు అనగా 15-06-2026వతేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకి ,నేదురుమల్లి కుటుంభం అభిమానులకు అందుబాటులో ఉండనున్నారు అని వెంకటగిరి వైస్సార్ కాంగ్రెస్ కార్యాలయం నుండి ప్రకటనలో తెలిపారు.

## ఆరోగ్య వరప్రదాయిని చింత చిగురు

**■ చింత చిగురు వల్ల కలిగే ప్రయోజనాలు..**



కడపజిల్లా(కెరటం)జూన్14:మానవుడు నేటి బిజీ పోటీ ప్రపంచంలో ప్రతి విషయంలోనూ దీటుగా పోటీ పడాలంటే కచ్చితంగా ఆరోగ్యం చిట్కాలు చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇందులో భాగంగానే చింత చచ్చిన పులుపు చావలేదు అన్న సామెతను మీరు వినే ఉంటారు.మానవునికి చింత చిగురు తో ఎన్నో లాభాలు ఉన్నాయనే విషయాన్ని స్మరించుకోవాలి చింత చిగురులో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.దీంతో ఇది సహజ సిద్ధమైన లాక్సేటివ్గా పనిచేసి విరేచనం సులభంగా అయ్యేలా చేస్తుంది.మలబద్ధకం సమస్య తొలగిపోతుంది.పైల్స్ ఉన్న వారికి కూడా చింత చిగురు బాగానే పనిచేస్తుంది.ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల చింత చిగురు చెడు కొలెస్ట్ రాల్ను తగ్గించి అదే క్రమంలో మంచి కొలెస్ట్ రాల్ను

పెంచుతుంది.వణుకుతూ వచ్చే జ్వరం తగ్గాలంటే చింత చిగురును వాడాలి.ఎందుకంటే ఇందులోని ఔషధ కారకాలు వైరస్ ఇన్ఫెక్షన్లపై పోరాడుతాయి.చింత చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట,వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు చింత చిగురులో ఉన్నాయి.వేడి వేడి మసాలా పదార్థాలు తినడం వల్ల నోటిలో వచ్చే పగుళ్లు, పూతలను చింత చిగురు తగ్గిస్తుంది.గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. శరీరంలో ఎర్రరక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు చింత చిగురులో పుష్కలంగా ఉన్నాయి.కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది.జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలో చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది.చింత చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధి లభిస్తాయి.ఇందు వల్ల ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది.యాంటీ సెప్టిక్,యాంటీ వైరల్ గుణాలు దీంట్లో ఉన్నాయి.పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసే ఔషధ గుణాలు చింత చిగురులో ఉన్నాయి.తరచూ చింత చిగురును తింటే ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి.థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారు చింత చిగురును తమ ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ఫలితంఉంటుంది.డయాబెటిస్ ఉన్న వారు కూడా చింత చిగురును వాడవచ్చు.ఇది వారి రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.ఆల్కహాల్ను ఎక్కువగా సేవించడం వల్ల కలిగే హ్యాంగోవర్ నుంచి ఉపశమనం కలిగేలా చేస్తుంది.చింత చిగురును పేస్టు చేసి దాన్ని కీళ్లపై ఉంచితే నొప్పులు,వాపులు తగ్గిపోతాయి.ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి ఇది మేలు చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపే గుణాలు చింత చిగురులో ఉన్నాయి. ఇది యాస్ట్రింజెంట్లా పనిచేస్తుంది.నేత్ర సంబంధ సమస్యలను కూడా చింత చిగురు దూరం చేస్తుంది.కళ్లు దురదగా ఉన్నప్పుడు కొంత చింత చిగురు తింటే ఉపశమనం కలుగుతుంది. ఇలా చింత చిగురు వలన నేటితరం మనిషికి ఎన్నో లాభాలు ఉన్నాయని చెప్పకనే చెప్పవచ్చు అంటున్నారు,పలువురు ఆరోగ్యాన్ని నిపుణులు.

## మోడలింగ్ రంగంలో ఎన్నో అవకాశాలు

**ప్రేక్షకులను అలరించిన స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో**



రాజమండ్రి (కెరటం )జూన్ 14: మోడలింగ్ రంగంలో రాణించిన వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో నిర్వాహకులు నవీన్ అన్నారు. ఏవీ అప్పారావు రోడ్ లోని ప్రసాద్ ఐ మాక్స్ థియోటర్స్ లో ఏర్పాటు చేసిన స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో ప్రేక్షకులను అలరించింది. గతవారం లాలా చెరువు,హైవే రోడ్డులో ఉన్న ప్రకృతి వేదిక లో నిర్వహించిన ఫ్యాషన్ షోలో గెలుపొందిన విజేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని క్యాట్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ దీప్, బిందు, ప్రియాంక , సంతోష్ కుమార్ మాట్లాడుతూ పోస్టర్ ఆవిష్కరణ దగ్గర నుంచి ఫ్యాషన్స్ నిర్వహించే వరకు ప్రకృతి వేదిక నిర్వాహకులు జీవి శ్రీరాజ్ కు ,ఐమాక్స్ థియేటర్ నిర్వాహకులు కు కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యాషన్ షో లలో పాల్గొనడం వలన టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్ లలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ షోలో గెలుపొందిన స్రవంతి మాట్లాడుతూ పెళ్లయిన తాను ఫ్యాషన్ షోలో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగిందని అన్నారు. అందం, టాలెంట్ ఉండడం వల్ల ఫ్యాషన్ రంగంలో అనేక అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి.. వికసిత భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**• బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపు**




విజయవాడ,కెరటం, జూన్ 14: యువత దేశాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని రాజకీయాల్లోకి రావాలని, వికసిత భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

దేశాన్ని 2047 నాటికి విశిష్ట భారతంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారని, ఆ లక్ష్య సాధనలో యువత భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాజకీయాలు కేవలం అధికారానికి మాత్రమే కాకుండా ప్రజాసేవకు వేదిక కావాలని, యువత మంచి లక్ష్యాలతో ప్రజా జీవితంలోకి అడుగుపెట్టాలని సూచించారు.

ప్రత్యేకించి యువతులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని, 25 ఏళ్లలోపు ఉన్న యువతులు ముందుకు వచ్చి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేసేలా బీజేపీ అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు.

ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఏ రంగంలోకి వెళ్లాలన్నా భయాన్ని విడనాడి, కష్టపడే తత్వాన్ని అలవరచుకోవాలని అన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సమగ్ర ఆలోచనతో ముందుకు సాగాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి యువత గళమెత్తాలని, అదే సమయంలో విపక్షాలు చేసే కుట్రపూరిత దుష్ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. విషం చిమ్మే శక్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, సమాజంలో గందరగోళం సృష్టించే వారి వెనుక ఉన్న శక్తులు ప్రజలకు అర్థమవుతున్నాయని వ్యాఖ్యానించారు.

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మాధవ్, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం వంద శాతం నిధులు అందించిన ఏకైక జాతీయ ప్రాజెక్టు అని తెలిపారు. పనులు వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చిన నేపథ్యంలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నంలో డేటా సెంటర్‌తో పాటు పలు భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు.

మోదీ ఆలోచనలు, అభివృద్ధి దృక్పథం, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా యువమోర్చా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన మోదీ నాయకత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

అలాగే ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర ప్రాంతంలో వెయ్యి కిలోమీటర్ల మేర పది లక్షల తాటి చెట్ల నాటే లక్ష్యంతో యువమోర్చా చేపట్టిన కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా యువమోర్చా కు మాధవ్ దిశానిర్దేశం చేశారు

తొలుత బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి మాట్లాడుతూ యువమమోర్చా బలోపేతానికి చేరికలను ప్రోత్సహిస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఈ రాష్ట్రానికి చేసిన సేవలు యువతకు వివరిస్తామన్నారు.

రాష్ట్ర యువమోర్చా కు ఇంఛార్జి గా ఉన్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ రాజు మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం యువమోర్చా చేస్తున్న కృషిని అభినందించారు.

బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు హరికృష్ణ,

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్య,బిజెవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మిట్టా వంశీ కృష్ణ, బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజేష్ యాదవ్ వేదిక ను అలంకరించారు.

## 16 న గాంధీ బొమ్మ సాక్షిగా "జమ్మలమడుగులో కూటమి గర్జన"

కడపజిల్లా(కెరటం)జూన్ 14:కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగాజమ్మలమడుగులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కూటమి నేతలు ప్రకటించారు.ఈ నెల 16న జమ్మలమడుగు పట్టణంలోని శ్రీ నారాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన గర్జన పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ పాత

బస్టాండ్ గాంధీ విగ్రహ వద్దకు ఈర్యాలీచేరుకుంటుందని,అనంతరం అక్కడే భారీగా కూటమి నాయకులు కార్యకర్తల జనసంద్రం మధ్యలోనే బహిరంగ సభలో బిజెపి ఎమ్మెల్యే

ఆదినారాయణ రెడ్డి,జిల్లా టిడిపి అధ్యక్షులు, జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భూపేష్ రెడ్డి సారథ్యంలో పెద్ద ఎత్తున ప్రజలను ఉద్దేశించి ప్రసంగం ఉంటుందని తెలిపారు.